# పశ్చాత్తాపము

అడపా సుగుణమణిగారు

సంపన్న బ్రాహ్మణ కుటుంబమున జన్మించి, సద్యోబాలారిష్టకో సౌమ్యబాలారిష్టకో ఆహుతి యైన పదుగురు పిల్లల తరువాత తప్పిజారి, బ్రతికి బట్టకట్టిన కనిష్టసంతానము కమల. ఆమె నక్షత్రబల మెట్టిదియో కాని జన్మించిన నెలదినములలోనే పితృ మారకము గలిగినది; మాతృ శరీరదారుఢ్యము పూర్తిగ నశించి శల్యావశిష్టమైనది. తొలుతనే బలహీనపు మనిషి. దానికితోడామాతృదేవి గార్హ్యస్త ధర్మ ముల ననుసరించి తన జవసత్వములను పదునొకండు బిడ్డలకు దారబోసి, కర్మానుసారముగ తటస్థించిన పుత్ర పుత్రికా నిర్యాణమున కృశించినది. అట్టియెడ కడపటి సంతానమగు కమల స్వాస్త్యము మూడు మూర్తుల తల్లిని బోలియున్నదని, లేదేని ఇంకను క్షీణించియున్నదని పలుకుట అతిశయోక్తి కానేరదు. కాని ఇంతమాత్రమున నామె సౌందర్యవతి కాదని తలంచుట కేవలము పొరపాటు. శుక్లపక్ష చంద్రుని పగిది దినదిన ప్రవర్ధమానయై, తానే సర్వస్వమని నమ్మిన తల్లికనుసన్నలలో మెలగుచు ఆపె అల్లారు ముద్దున కాస్పదమై, భర్తృవియోగ దుఃఖమును, శరీరక్లేశమును కాలక్రమేణ మరపింపజేసిన దా మధురమూర్తి కమల.

చాపక్రింద నీరువలె కాలము సాగిపోవుచుండును. కాలము గతించుచున్న కొలది ప్రకృతిలో మార్పులు కానవచ్చును. తండ్రి గతించునప్పటికి పొత్తిళ్లలోని పసికందు అగు కమల ఇపుడు నవయవ్వన విలాసి నియై, తన అష్టాదశవత్సరమున ఉన్నత విద్యాభ్యాస మునకై విశ్వవిద్యాలయమున ప్రవేశించెను. ఆమె తెలివితేటల కచ్చెరువుపడని విద్యార్థులు, ఆమోదిం చని ఉపాధ్యాయులు, సోయగమునకు మోహవాల్చని యువతులు, ముగ్ధులుగాని యువకులు లేరని చెప్పుట స్తుతివాక్యము కాదు. విదుషినని గర్వము కాని, రూపసినని అహంభావము కాని ఆమెయందణు మాత్రమును లేదు. గృహకృత్యములందు బాధ్యత లేకుండ తన కాలమునంతయు చదువునందే వినియో గించుట కనువుగ తల్లి యింటిపనులన్నియు తానే స్వయముగ నిర్వహించుకొని, తనకుగల సామాన్య స్థితితో అనవసరపు భేషజముల కాశించక బహుక్లుప్తము గా కాలయాపనము చేయుచున్నందున తల్లి యభి మతమును నెరవేర్చుటయే ముఖ్యోద్దేశముగాగల కమల తన స్వయంకృషి, కుశాగ్రబుద్ధి, మేధాశక్తులపటిమచే సకాలమున పట్టభద్రయై మాతృ ఆశీర్వచనమును బడసెను.

*  *  *  *

యుక్తవయస్కులగు స్త్రీ పురుషులొండొరులు ప్రేమబద్ధులగుట ప్రకృతి ధర్మము. అందు మనో వాక్కాయ కర్మలచే కట్టువడిన పవిత్రప్రేమయే సృష్టికి హేతుభూతము. కమల విద్యాభ్యాసకాలము ననే ప్రేమించిన ఆపె సహపాఠి భాస్కరరావు అన్ని విధములను యామెకు తగిన వరుడు. కొలది దినములలో వారి వివాహము ఒక శుభముహూర్తమున బంధు, మిత్ర, ఆప్తవర్గమధ్యమున దివ్యముగా జరిగినది. వివాహమున కేతెంచిన పుణ్యదంపతులు నేసలిడి నూత్నవధూవరుల నాశీర్వదించిరి; మిత్రవర్గము సంత సించి అద్వితీయ వివాహమని శ్లాఘించిరి. ఆశీర్వాద

ములకు ఫలములు, ముహూర్తములకు యోగములు తప్పక తటస్థించినచో భగవంతుడొకడు గలడని మానవులకు తలంపే యుండకపోవునేమో !

కమల కళ్యాణముజరిగి వత్సరము గతించినది. ఈవత్సరములో భాస్కరరావునకు తలిదండ్రులు గతించి యింటిపెత్తనమును, కమలకు 'నా' యను తల్లిగతించి మాతృగృహ శూన్యత్వమును తటస్థించినవి. ఇట్టి అనివార్యములును, విధిప్రేరితములగు కష్టములు తటస్థించినను ఆ నూత్నదంపతుల జీవిత మవిచ్ఛిన్నముగ మొదటివత్సరము సాగినది. సంతతికై వ్రతములొనర్చి, కడుపు చలువకొరకు తపస్సు దారపోయు భారతస్త్రీకి తానొక బిడ్డతల్లి కానున్నదని తెలుసుకొనుటకన్నను వేరొక సంతోష ఘట్ట ముండబోదు. అందువలననే సంతాననిరోధ ప్రచారములు, అర్థికమాంద్యము, నిరుద్యోగసమస్యలు వారి పెడచెవినిపడి, దృక్పథమునపడక, ఊహాతీతమై పోవుచున్నవి.

పాపము ! కమలకుమాత్రమీ సంతోషముతో పాటు విషాద మాచ్ఛాదించినది. ఆమె గర్భము దాల్చినదిమొదలు వైద్యులపరిశీలనలకు, ఔషధసేవనలకు పాలుగాని దినమొక్కటిలేదు. ఆమె ఎంతటి పథ్యపానములకు కట్టువడినను శరీరస్థితి స్వస్థత చెందలేదు. తానున్న యింతటి దుర్బల స్థితిలో తనకు సుఖప్రసవము గలుగునా ? కలిగినచో జన్మించినశిశువు దక్కునా ? మున్నగుసంశయము లామెను పట్టిపీడించి అహోరాత్రములు చిత్తశాంతిలేకుండ చేసినవి. దీనికి తోడాయమ తనభర్త నడవడికలో నొకవింతమార్పు కనిపెట్టినది. ఇదివరలోవలె భర్తదగ్గర జేరి మనోధైర్యము కలుగచేయుటకై ప్రోత్సహించుట మున్నగునవి లేవు. క్రమముగా నతనిదర్శనమే దుర్లభమాటచే ఆమెకు దుర్బలత్వమునకుతోడు మనోవేదన నైదోడయినది.

* * * *

కష్టము లొంటరిగారావు. కమలకు జన్మించిన పుత్రుడు నామకరణము కాకమునుపే నామమాత్రావశిష్టుడై గతించెను. తన భర్తృభావిప్రేమ దేనిపై నాధారపడియున్నదో, నిరంతరము తా నేదానికై వేయిదేవుళ్లకు మ్రొక్కుచుండెడిదో అట్టి తన గర్భఫలము అందరానిదౌటచే కమలకంటికి మంటికి నేకధారగ నేడ్చుచుండెను. 'చచ్చెడివారి కేడ్చెదరు చావకయుండెడివారి భంగి' అన్న వేదాంతవాక్యమంద కరింగినదే. కాని ఆచరణలోనికిమాత్రము తేవడముకష్టము. తేలేము. -

నాడు భాస్కరరావు ఏదో తనకువలసిన పుస్తకమునకై బీరువా వెదకుచుండెను. కమల మంచము పట్టినతరువాత అతడు కొంతసేపయినను ఇంటనిల్చుటకిదియె ప్రథమము. సమయముకనిపెట్టి కమల ఆగదిలో ప్రవేశించి, అతనితో సంభాషణ కుపక్రమించెను.

"దేనికొరకై వెదకుచున్నారండీ ?"

"నేపడిన బురదగుమ్మినుండి తప్పించుకొను 'ఉపాయమునకై వెదకుచున్నాను. తెలిసినదా ?"

"తమకంతటి మనోవ్యాకులత కలుగజేసే విషయమేమో నాతో చెప్పరాదా ? నావలన లోపమున్నచో సవరించుకొనుట కవకాశ ముండును గదా ?"

"లోపము నీదికాదు నాదే. నిన్ను పెండ్లిచేసుకొనేముందు కొంచెం బుద్ధినుపయోగించి ఆలోచించవలసి యుండెడిది, కాని నాడు నాతెలివి తెల్లవారినది. నేడు దాని ప్రతిఫల మనుభవిస్తున్నాను."

"త్రికరణశుద్ధిగ నాకర్తవ్యమును నెరవేర్చుకొనుటకై యత్నించితిని యత్నించుచున్నాను. ఇంకను నావిహితకృత్యములలో తమకు లోపము కనబడుట నాదురదృష్టము."

"నీనడవడికలో లోపమని నేననలేదు. రోగభూయిష్టవగు నీమూలమునగాని లేకున్న నాపుత్రునకు

పేరుపెట్టుటకుమున్నే నూరేండ్లు నిండియుండునా? ...సరే...జరిగిన దేదియో జరిగినది. ఇంకనూ గతజల సేతుబంధన మేల?...నాజీవితమంతయు ఒక మనిష్షికి ధారపోయుట అసంభవము. నాభావిజీవితాన్ని కంటకరహితంగా చేసుకొనేదారి నేను చూసుకొంటాను. నేటినుండి నీయిచ్ఛను నీవు ప్రవర్తింపవచ్చు. నా యభ్యంతరము లేదు."

"ప్రేమ స్వార్థలాభకాంక్షి. నిజమే. లేకున్న దైవవశమ్మున నాకనారోగ్యము కలుగుటయు, మన ప్రణయమున కింతటి చాంచల్యము తటస్థించుటయు ఏమని తలంచవలయును? 'నిలకడమున్న, తాల్మినహి, నేస్తముదబ్బర...'అని ముద్దుపళని పురుషులస్వాభావికము నెంతటి స్వానుభవముతో నుద్ఘోషించినదో? మన వివాహమునకుపూర్వము మీరాడిన లాలనవాక్యములకు, నేడుపల్కిన నిష్ఠురపువాక్యములకు గల వ్యత్యాసమును పరికించినచో తెలియగలదు. మనకు గల ప్రేమబంధ మగ్నిసాక్షిగా జరిగినప్రమాణముగాని తాత్కాలికపు నటనకాదు. కష్టములు కాపురముండవు. నేడు గాకున్న నెలదినములలోనైన నే నారోగ్యము బడయగలను. చెట్టునకు కాచిన కాయలన్నియు ఎట్లు దక్కవో అట్లే కలిగినపిల్లలందరూ చిరంజీవులగుదురన్నమాట అరుదు. ఇంతమాత్రమున నన్ను పరిష్కరించుట న్యాయముకాదు."

"నీచదువు కట్టిపెట్టు. 'త్యజన్తి భార్యాం దశపుత్రమాతరమ్' భార్య అనుకూలంగాలేనప్పుడు పదిమంది బిడ్డల తల్లియైనప్పటికి విడచిపెట్టమన్నారు. లేకపోతే వాడికి వేరేనరకంలేదు."

"నేను ప్రతికూలంగా నడచేసందర్భం ఒక్కటి నిదర్శనంగా చెప్పమనే కదటండీ ప్రార్థిస్తున్నది."

"ప్రతికూలమేమిటి నాఖర్మం."

"ఏనాడు పరస్త్రీలను సోదరీభావముతో చూడటం మానివేశారో, ఏనాడు మీహృదయపీఠమున పరస్త్రీలకు తావు లభించిందో ఆనాడే మన ప్రేమలతకు వేరుపురుగు పట్టింది. పురుగో లతో నాశనమొందుటయే గాని గత్యంతరము లేదు. మనసు విరిగినతరువాత అతకడం కష్టం. ఒల్లనన్న మిమ్మల్నిపట్టి పెనుగులాడటం, అంకురిస్తున్న మీ నూతనప్రణయానికి అడ్డు తగలడం, మీభావిజీవితాన్ని దుఃఖపూరితంగా చేయటం, నాస్థాన మాక్రమించుకోబోయే నాభాగ్యవతి కపచార మొనర్చడం తప్ప. ఇది దుర్ఘటననుండి తప్పింపలేదు. భగవంతుడిచ్చిన అవయవములు సక్రమముగా నున్నంతకాలము కష్టపడి పొట్టపోషించుకోగలను. సృష్టిలో ఉదరనిమిత్తం ఒకజీవి మరియొక జీవిపై నాధారపడుట నికృష్టజన్మగా పరిగణింపబడు పశుపక్ష్యాదులలో సహితము లేదు. అట్టియెడ మానవమాత్రులకిది అసాధ్యముకాదు. లేనిచో మందో, మాకో, నూయో, గోయో చూచుకొని కడతేరగలను. ఇకనైనా నన్నువిడచి, మీ భావిజీవితాన్ని కంటకరహితంగాచేసుకొనండి అంతే. ధన్యవాదాలు" అంటూ కట్టుబట్టలతో 'నా' అన్నవారులేని విశాల ప్రపంచములోనికి వెడలిపోయింది తిరస్కృత ప్రణయిణి కమల.

* * * *

భాస్కరరావునకు ద్వికళత్రయోగము సిద్ధించినది. సిద్ధించ కేమి మగమహారాజులకు? భార్య కలదన్న విచక్షణ ద్వితీయవివాహము చేసుకొన సంకల్పించుకొన్నవాళ్లకి లేక, చేసేవాళ్లకి లేక, పిల్లనిచ్చేవాళ్లకి లేనపుడు మరి వివాహములకేమి విరామము? "కొనెడువారుంటచేతనే గోవులవధ, త్రాగువారుంటచేతనే తాళ్లగీత" అన్నట్లు పిల్లనొసంగువారుండుటచేతనే పెండ్లాడువారు. క్రొత్తపెండ్లాముతో కులుకుతూ కూర్చొని, మోహసముద్రములో మునిగితేలుచున్న భాస్కరునకు కమల కష్టసుఖముల నైన నరయుటకు తలంపు గలుగలేదు. స్వార్థపరులగు పురుషుల స్వాభావికమే యట్టిది.

# పశ్చాత్తాపము

ఆరువత్సరములు గడచినవి. భాస్కరుని రెండవ భార్య కొమార్తెగని పురుటాలిజబ్బువలన నకాల మృత్యువువాతబడెను. భాస్కరునకు నల్దిక్కులా అంధకార మావరించినది. కాళ్లకు సంకెళ్లవలె శిశుపోషణాభారమాతనిపై బడినది. కారణము లేకనే కలహించి ప్రథమభార్యను పరిత్యజించిన ఘట్ట మాతని కండ్లయెదుట గట్టినట్లయ్యెను. భార్యను పరిత్యజించుటవలన పరితాపము, మరణించినభార్యకై దుఃఖము, శిశువుపైగలిగిన యభిమాన మొక్కుమ్మడి హృదయమును కలతపెట్ట నాత డున్మత్తునివలె సంచరింప దొడగెను.

*　　*　　*　　*

కమల భర్త యింటనుండి వెడలిన తరువాత కొన్నాళ్లకు ప్రభుత్వపాఠశాలలో నుపాధ్యాయనిగా ప్రవేశించెను. ఆమె తెలివితేటలకును, బోధనాక్రమమునకును ఉన్నతోద్యోగులు సంతసించి ప్రోత్సహించిరి. ఆప్రోత్సాహమువలన నామె కార్యదీక్ష ద్విగుణీకృతమయినది.

నాడు శెలవుదినమగుటచే కమల ఇంటకూర్చొని విద్యార్థినీ వ్యాసరచనలను పరిష్కరించుచుండెను. భాస్కరుడు వికృతరూపముతో ద్వారముదరినుండి "కమలా! కమలా!"యని పిలుచుచు లోనికివచ్చి నేరస్థునివలె తలవాల్చి ఆమెమ్రోలనిలచెను. కమల నివ్వెరపడిలేచి, రెండడుగులు వెనుకకువైచి, పొంగి పొరలివచ్చు దుఃఖ మశ్రురూపముగ వెల్లువలై ప్రవహింప "నేటికైననూ నే సజీవురాలనైయున్నానని తమకు స్పృహించుట నాయదృష్ట"మని గద్గదిక స్వరమున పలికెను.

"కమలా! నిన్నాడినమాటలకు, నీకొనర్చిన అపచారమునకు తగిన ప్రాయశ్చిత్తమును బడసితిని. నీయెడ నేనొనర్చినపాపమే నన్ను కట్టికుడిపినది; కుడుపనున్నది. దానికి పరిహారమేలేదు. క్షమార్పణ కోరుకొనుటకైన ననర్హుడనగు నేను నా అంత్యకోర్కె నెరవేర్పబడునన్న విశ్వాసముతో వచ్చితిని. కమలా! నాజీవితము నిరర్థకము. నాకింక మరణమే శరణ్యము. నాశిశువునెట్లయిన పోషించుబాధ్యత నీవు గైకొన్నచో నిశ్చింతగా నసువుల వీడుదును."

"మీ పునస్సందర్శనము లభించుటచే నేడు సుదినము. మీకు పశ్చాత్తాపము గలుగుటయే నాభాగ్యము. మరల నాకు భర్తృసేవ లభించుటయే నాయదృష్టము. నాకంఠమున జీవము లున్నంతవరకు మీరు నిస్పృహ జెంద నక్కరలే"దని భర్తతో కమల అత్తవారింటికి బయలుదేరినది.